www. aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
adikavi Nannaya University
9701293231

చాళుక్య ద్వారము

తొలి తెలుగు విశ్వవిద్యాలయ వారపత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కులసచివులు

సంపాదకులు
డా.తలారి వాసు — సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్ — ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 1 | సంచిక :21 | 01-03-2021 | పుటలు : 4


## ఔన్నత్యం




అబ్దుల్ కలాం రాష్ట్రపతిగా ఉన్నప్పుడు ఓసారి కూనూరు (ఊటీ) వెళ్లారు. అక్కడికి వెళ్లాక తెలిసింది, ఫీల్డ్ మార్షల్ శాం మానిక్ షా అక్కడే ఓ మిలిటరీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారని..! 1971 ఇండో-పాక్ యుద్ధ సమయంలో తను మన ఆర్మీ చీఫ్... తనను పరామర్శించాలని అప్పటికప్పుడు నిర్ణయించుకుని నేరుగా వెళ్లారు. మానిక్ షా బెడ్ పక్కనే చాలాసేపు కూర్చుని ఆరోగ్యస్థితిని కనుక్కున్నారు. వేగంగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

తిరిగి వెళ్లిపోయే సమయంలో...

"ఇక్కడంతా సౌకర్యంగానే ఉందా..? నేను చేయదగిన సాయం ఏమైనా ఉందా..? అడుగు మిత్రమా..?" అన్నారు కలాం...

"ఓ అసంతృప్తి ఉంది సార్..." అన్నాడు మానిక్ షా...

"ఏమిటది..?" కలాం మొహంలో ఆశ్చర్యం...

"నా దేశ ప్రథమ పౌరుడే నా దగ్గరకు వచ్చినప్పుడు నేను లేచి తనకు సెల్యూట్ చేయలేని స్థితిలో ఉన్నందుకు అసంతృప్తి సార్..." అన్నాడు కళ్లు తుడుచుకుంటూ...

కలాం కళ్లల్లో కూడా తడి... షా చేయి మీద చేయి వేసి ఆత్మీయంగా నొక్కాడు...

"సార్, చిన్న రిక్వెస్టు... ఇరవై ఏళ్లుగా నాకు ఫీల్డ్ మార్షల్ ర్యాంకుకు దగిన పెన్షన్ రావడం లేదు..." చెప్పాడు షా...

కలాం ఢిల్లీ వెళ్లగానే చేసిన మొదటిపని... షా పెన్షన్ ఫైల్ తెప్పించుకోవడం..! తగిన ఆదేశాలు జారీచేయడం...! వారం రోజుల్లో డిఫెన్స్ సెక్రెటరీ ద్వారా 1.25 కోట్ల బకాయిలకు సరిపడా చెక్కును ప్రత్యేక కొరియర్ ద్వారా ఊటీకి పంపించారు... దటీజ్ కలాం... ఇక్కడే చిన్న ట్విస్టు... ఆ డబ్బు మొత్తాన్ని మానిక్ షా ఆర్మీ రిలీఫ్ ఫండ్‌కు డొనేట్ చేశారు... దటీజ్ షా... వావ్... ఎవరు ఎవరికి సెల్యూట్ చేయాలి..? ఒకరు తక్కువ కాదు, ఒకరు ఎక్కువ కాదు... జాతి సెల్యూట్ చేయదగిన వ్యక్తులు.

## కంప్లైంట్ మేనేజ్మెంట్ సిస్టమ్‌తో సమస్యలు పరిష్కారం

### వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు



డా.పద్మారావుకు ప్రొసిడింగ్స్ అందిస్తున్న వీసీ, రిజిస్ట్రార్


**22.02.21** (మీడియాసెల్) ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో కంప్లైంట్ మేనేజ్మెంట్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశామని, అన్ని సమస్యలనూ కంప్లైంట్ మేనేజ్మెంట్ సిస్టమ్ ద్వారా పరిష్కరిస్తామని ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. విశ్వవిద్యాలయంలో మంగళవారం "కంప్లైంట్ మేనేజ్మెంట్ సిస్టమ్"ను వీసీ ప్రారంభించి వివరాలను తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే ఎక్కువ అనుబంధ కళాశాలలతో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రాష్ట్రంలోనే అతిపెద్ద విశ్వవిద్యాలయంగా, గోదావరి జిల్లాల విద్యాకేంద్రంగా కీలక పాత్రను పోషిస్తుందని అన్నారు. ఎన్నో బాధ్యతలను నిర్వహిస్తున్న విశ్వవిద్యాలయానికి కొన్ని సమస్యలు, కొరతలు ఉంటాయని ఆ సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించేందుకు కంప్లైంట్ మేనేజ్మెంట్ సిస్టమ్‌ను ప్రారంభించామని తెలిపారు. విశ్వవిద్యాలయ పరిపాలన వ్యవస్థను క్రమబద్ధీకరిస్తూ సమస్యలను పరిష్కరించడం దీని లక్ష్యమని అన్నారు. విశ్వవిద్యాలయంలో పని చేస్తున్న అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది సమస్యలను యూనివర్సిటీ వెబ్‌సైట్‌లోని కంప్లైంట్ మేనేజ్మెంట్ సిస్టమ్ ద్వారా ఫిర్యాదు చేస్తారని దానిని సంబంధిత శాఖ వారు వెంటనే పరిష్కరించాలని చెప్పారు. ఆన్‌లైన్ ఫిర్యాదుపై సత్వరం స్పందించని విభాగాధికారులకు మెయిల్స్, మెసేజ్ అలర్ట్ వస్తుందని అన్నారు. ఆయా విభాగాల నుండి వచ్చిన ఫిర్యాదులకు నిర్ణీతకాలంలో పరిష్కారాలను చూపించాలని వాటిని ఎప్పటికప్పుడు వీసీ డెష్ బోర్డులో తాను పర్యవేక్షిస్తుంటానని తెలిపారు. కంప్లైంట్ మేనేజ్మెంట్ సిస్టమ్‌లో ఫిర్యాదులు, పరిష్కారాలు, పనిలో జాప్యం తదితర అంశాలను ఆఫ్‌లైన్‌లో పర్యవేక్షించేందుకు కెమిస్ట్రీ విభాగ సహాయాచార్యులు డా.చేకూరి వెంకట పద్మారావును ఫ్యాకల్టీ అసోసియేట్ అండ్ ఫీల్డ్ ట్రాకింగ్‌గా నియమించామని తెలియజేశారు. ఈ సందర్భంగా డా.పద్మారావుకు వీసీ, రిజిస్ట్రార్‌లు ఫ్యాకల్టీ అసోసియేట్ అండ్ ఫీల్డ్ ట్రాకింగ్ ప్రొసిడింగ్‌ను అందజేశారు. కంప్లైంట్ మేనేజ్మెంట్ సిస్టమ్ ఆన్‌లైన్ ఫిర్యాదులు, ప్రోసెసింగ్ తదితర అంశాలను కోఆర్డినేటర్ మంచెం శ్రీనివాసరావు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. దీన్ని రూపొందించేందుకు సహకరించిన ఇంజినీరింగ్ ఫైనలియర్ విద్యార్థి ఎం గోపీచంద్‌ను వీసీ అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ప్రిన్సిపల్స్ డా.వి.పెర్సిస్, ఆచార్య ఎస్.టేకి, డా.కె.రమణేశ్వరి, డా.కె.సుబ్బారావు విశ్వవిద్యాలయ అధికారులు అధ్యాపకులు పాల్గొన్నారు.



కంప్లైంట్ మేనేజ్మెంట్ సిస్టమ్ బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీసీ



తిరుపతి ఐఐటీలో ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా ప్రణాళిక బోర్డు మొదటి సమావేశాన్ని నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ లోని విద్యాశాఖ ఉన్నతాధికారులు, విశ్వవిద్యాలయ ఉపకులపతులంతా ఈ సమావేశంలో పాల్గొన్నారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు వచ్చే సంచికలో....



అడుగు తప్పితే....
జారిపడక తప్పదు మెట్టు నుంచి !

పరిధి దాటితె...
మరుగుపడక తప్పదు జట్టు నుంచి !


కుదురుగా ఉంటేనే...
మనిషికుంటుందిరా విలువ !!

– ఆచార్య సి.నారాయణరెడ్డి

ఫిబ్రవరి 28

## నేషనల్ సైన్స్ డే

## శుభాకాంక్షలు !!



## 3న పాజిటీవ్ సైకాలజీపై నేషనల్ వర్క్‌షాప్

### బ్రోచర్ ఆవిష్కరించిన వీసీ జగన్నాథరావు

**24.02.21** (మీడియాసెల్) ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో మార్చి 3న పాజిటీవ్ సైకాలజీపై నేషనల్ వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నారని దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. విశ్వవిద్యాలయంలో బుధవారం నేషనల్ వర్క్‌షాప్‌కు సంబంధించిన బ్రోచర్‌ను వీసీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపార్ట్మెంట్ ఆఫ్ సైకాలజీ, స్పృహ సైకాలజీ అలుమ్ని అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యాన నేషనల్ వర్క్‌షాప్‌ను విశ్వవిద్యాలయం సెమినార్ హాల్‌లో నిర్వహిస్తున్నారని అన్నారు. "పవర్ ఆఫ్ పాజిటీవ్ సైకాలజీ" అనే అంశంపై జరిగే ఈ వర్క్‌షాప్‌కు సైకాలజీ విభాగ సహాయాచార్యులు డా.ఎన్.వి.వి.ఎస్.నారాయణ కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారని తెలిపారు. రీసోర్స్ పర్సన్‌గా కోయంబత్తూర్ పి.ఎస్.జి కాలేజ్ సైకాలజీ విభాగాధిపతి డా.రూప సెల్వరాజ్ హాజరై ఉపన్యసిస్తారని చెప్పారు. పాజిటీవ్ సైకాలజీ పరిచయం, పాజిటీవ్ ఎమోషన్స్ పాత్ర, స్థితిస్థాపకత సానుకూల దృక్పథాల అభివృద్ధి, పాజిటీవ్ రిలేషన్ షిప్, సాంఘిక ప్రవర్తన, కృతజ్ఞత అనే లక్ష్యాలతో ఈ జాతీయ కార్యశాలను నిర్వహిస్తున్నారని దీనిని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.టేకి, కోకన్వీనర్లు డా.పి.రాజశేఖర్, డా.సి.వి.ఎస్. మణిరమణ, సిహెచ్.ఎన్.కె.భవాని, స్పృహ అలుమ్ని అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎస్.నాగేంద్ర కిషోర్, లీగల్ ఆఫీసర్ నందెపు నాగేంద్రరావు పాల్గొన్నారు.



నేషనల్ వర్క్ షాప్ బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీసీ

## సంపాదకీయం




## కర్తవ్య నిష్ఠ

*" జబ్ తక్ నానా - తబ్ తక్ పూనా "*

నానా ఫడ్నవీస్ ఉన్నంతకాలం పూనా సంస్థానాన్ని జయించలేమనే నానుడి.ఒకసారి పూనా సంస్థానానికి ఒక దారు శిల్పి వచ్చి మూడు చెక్కబొమ్మల్ని మహారాజు ముందుంచి, మహారాజా! ఇవి మూడూ ఒకలాగానే ఉన్నా వీటిలో ఒకదానికొకటి భేదాన్ని కలిగి ఉన్నాయి గమనించండని అన్నాడు. ఆ మూడుబొమ్మల్ని పరిశీలించిన మీదట ఎవ్వరికీ ఏమాత్రం భేదం కనిపించలేదు. నానా ఫడ్నవీస్ వాటిని తీసుకుని రేపటి రోజున ఇందులో ఉన్న భేదాన్ని తెలియజేయవచ్చునా అని అడిగాడు.సరే అన్నాడు శిల్పి. మరుసటి రోజు అందరూ చాలా ఆసక్తికరంగా ఎదురు చూస్తున్నారు. నానా
ఆ బొమ్మల్ని మహారాజుకి చూపిస్తూ.... ఈ మూడు బొమ్మలు చూడటానికి ఒకలాగానే ఉన్నా చాలా భేదాన్ని కలిగివున్నాయి మహారాజా! మొదటి బొమ్మ చెవిలోకి ఒక గడ్డిపరకను పంపించాను. అది రెండవ చెవి నుంచి బయటికి వచ్చింది. రెండవ బొమ్మకు పంపించినప్పుడు గడ్డి పరక దాని నోట్లో నుంచి బయటకు వచ్చింది. మూడవ బొమ్మ చెవిలోంచి పంపించినప్పుడు అది అతని చెవిలో నుంచి కానీ, నోట్లోంచి కానీ బయటకు రాలేదు. ఈ మూడు బొమ్మల ద్వారా శిల్పి ఒక గొప్ప సందేశాన్ని మనకు అందిస్తున్నాడు. మొదటి బొమ్మలాంటివాళ్ళు వింటారు, అవతలి చెవిలో నుంచి వదిలేస్తారు. ఇక రెండవ బొమ్మ లాంటి వాళ్ళు వింటారు.. తిరిగి దాన్ని ఇతరులకు చెబుతారు.
ఇక మూడవ బొమ్మ లాంటి మనుషులు... వాళ్లు మనం చెప్పింది విని వదిలేయరు, దానిగురించి మాట్లాడరు. చెప్పినదానిని మౌనంగా చేసుకుంటూ వెళ్ళిపోతారు.
కర్తవ్య నిష్ఠతో పనిచేసుకుంటూ వెళ్ళిపోయేవారు మాత్రమే మన సంస్థానానికైనా,
ఏ వ్యవస్థకైనా అవసరం. అటువంటి వారి వల్లనే ఈ దేశం అభివృద్ధి చెందుతుంది. అటువంటి మనుషులు మనకు కావాలనే సందేశాన్ని శిల్పి అందిస్తున్నాడని నానా ఫడ్నవీస్ అన్నాడు.
జరిగిన కథలో మనకు కావలసిన సందేశం...
కర్తవ్య నిష్ఠతో పనిచేయటం అనేది ప్రధానమైన అంశం.అప్పుడే విజయాలు సొంతమవుతాయి.

## నాలుగో ఎకరం పుస్తకం






"నాలుగో ఎకరం" ఇటీవల వచ్చిన శ్రీరమణ గారి పెద్ద కథ. ఈ పుస్తకం ఈ మధ్య సాహిత్యంలో వచ్చిన అందమైన పుస్తకంలా చెప్పుకోవాలి. శ్రీరమణ గారి కథ కన్నా ఈ కథ కోసం చిత్రకారుడు గిరిధర్ గౌడ్ వేసిన అందమైన చిత్రాలు ఈ పుస్తకానికి అదనపు ఆకర్షణ. ఒక కళాకారుని నిబద్ధత అతని పనిలో కనిపిస్తుంది. గిరిధర్ గారు చేయి తిరిగిన చిత్రకారులు. కథ చదివి కథలో వున్న వూరు చూసి అప్పుడు బొమ్మలెయ్య ప్రయత్నిస్తానని రచయితతో పాటు వారి వూరు వెళ్లి అక్కడ ఉండి శిధిలమైపోయిన ఎడ్లబళ్ళూ, నాగలిదుంపలు, ప్రాణంలేని గొడ్లసావిళ్ళూ, బండిమోకులు ఇలా ఎన్నో అవశేషాల ఆనవాళ్ళూ కలిసి చూసి అప్పుడు ఈ కథకు సంబంధించిన బొమ్మలు వేశారు. అందుకే వీరి చిత్రాలు ఈ కథకు ప్రాణం పోశాయి. ముఖ్యంగా పుస్తకం మధ్యలో వేసిన చెరువు మధ్య నంది విగ్రహం ఎంత గొప్పగా ఉందంటే దాన్ని ఎన్ని సార్లు చూస్తూ ఉండిపోవాలో. కథలో రచయిత అక్షరాలతో మనసును తాకితే గిరిధర్ తన బొమ్మలతో ఎన్ని కబుర్లు చెప్పారో. ఎంతో ఉద్వేగంతో చదివి పంచుకుంటున్న పుస్తకం ఇది.
కథలో రచయిత అంతరించిపోతున్న ఎన్నో పల్లెటూరి పదాలను వాడారు. వాటి అర్థాలను విడిగా ఇవ్వడం కూడా జరిగింది. వ్యవసాయ కుటుంబాలు తగ్గిపోతున్నప్పుడు, ఆధునిక వ్యవసాయ జీవనంలో చాలా వరకు జీవిత క్రమం, పని తీరు మారిపోయాయి, వీటితో పాటు ఆ వర్గం భాష కూడా ఆధునిక భావజాలంతో చాలా ప్రభావితమైపోయింది. ఎన్నో పదాలు ఇప్పుడు వాడుకలో లేవు. తెల్లగొడ్డు, తోడాలు, పులికాపు, వార్నిపీట, గొరకొయ్యలు, తాటికర, కొలగారాలు, అర్రు,పసికర్రలు లాంటి ఎన్ని పదాలు మాయం అయిపోయాయో. అలాగే గొప్ప పనితనం కూడా ఆ తరంతో అంతరించిపోయింది. రాగుల మంచం అల్లగలిగే రైతులు ఇప్పుడు కనిపిస్తారా.రాగుల మంచం గురించి చెపుతూ రచయిత రాస్తారు "మెట్టగోగుల నారతో పేనిన నులకతో అతివత్తుగా దీనిని అల్లుతారు. రాగులు, సజ్జలు లాంటి తృణధాన్యాలను ఆ మంచం మీద ఏ వస్త్రం లేదా గోతం లేకుండా ఆరబోసుకోవచ్చు, ఒక్క గింజ కూడా కిందకి జారదు, రాగుల మంచం చిక్కని అల్లిక ఓ ప్రత్యేక శిల్పం" అలాగే మరో సందర్భంలో కర్పూరపు నులక గురించి రాశారు "ముద్దకర్పూరంతో నులక పేనడం ఒక సంప్రదాయం. గుంటూరు జిల్లా పొన్నూరు మరికొన్ని ప్రాంతాల్లో కొత్త అల్లుడు మంచానికిచ్చే నులకని గారంగా, గౌరవంగా, కర్పూరంతో పేనడం రివాజు. ఇంకా పల్నాటి సీమలో దుర్గి వేణుగోపాలస్వామి పవళింపు సేవల మంచపుచక్కీలను కర్పూరపు నలుగుతో పేనడం ఆలయ
సంప్రదాయం. ఇది చెన్నకేశ్వరుని భోగం కూడా. ఇది వైష్ణవ సంప్రదాయం. "

ఈ కథలో ఒక పూజారి, ఊరిలో పెదకాపు గా పిలవబడే ఒక రైతు స్నేహం గురించి ఉంది. వారి పాత్రల ద్వారా ఊరిలో మారుతున్న పరిణామాలకు తమను తాము మార్చుకోలేక నలిగిపోయే పకృతి పుత్రుల సంఘర్షణను రచయిత అద్భుతంగా చూపించారు. పూజారి కుమారుడు చదువుకుని ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నాడు. రైతు కుమారుడు చదువుకోవాలని ప్రయత్నించి, ఊరు నుండి తల్లితండ్రుల నుండి దూరం కాలేక తిరిగి ఊరు చేరిపోతాడు, కార్పొరేట్ కాలేజీ ఊరిమధ్యలో వస్తుంది. మెల్లగా రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకుంటుంది, వ్యవసాయంతో దిగులు పడుతున్న రైతు కుటుంబం భూమికి విపరీతమైన రేటు వస్తుంది. అమెరికాలో ఉన్న కూతురుని కూడా భూమి అమ్మడాకిని ఒప్పిస్తారు బ్రోకర్లు. ఆమె కూతురు ఓణీల పండుగను కూడా స్వయంగా జరిపించి ఆ భార్యా బిడ్డలకు, కుటుంబానికి మరో ప్రపంచాన్ని చూపిస్తారు. ఎప్పుడో మాటల మధ్య ఆమెకు నాలుగో ఎకరం ఇస్తాం అన్న మాటను ఇప్పుడు తండ్రికి గుర్తుచేసి డబ్బు తనను ఎలా ఆక్రమించుకుందో చెప్పీ చెప్పక చెప్పిన కూతురు స్వార్థాన్ని తండ్రి చూసి పడే వేదన కదిలిస్తుంది. మాట ప్రాణంగా నిలబడే ఆ తండ్రి తన బిడ్డలో ఈ మార్పు సహించలేక పైకి చెప్పలేక నలిగిపోతాడు. వంట కోసం పొయ్యిలో పెట్టిన ఇంటి నాగలి చూసి తట్టుకోలేక మంటల్లో చేయి కాల్చుకుని ఆస్పత్రి పాలవుతాడు. చివరికి వేలిముద్ర వేయడానికి అతని చేతులు పనికి రావని రిజిస్ట్రేషన్ కోసం తాము మళ్ళీ రావలసివస్తుందని టిక్కట్లు ఖర్చు అని భర్త అంటున్నాడని బాధపడే ఆ అక్క గురించి నిర్వేదంగా తమ్ముడు చెప్పినప్పుడు గుండెలోనుండే దుఃఖం తన్నుకు వస్తుంది. ఎంతో సున్నితంగా పల్లెజీవితంతో ముడిపడిఉన్న ఆ తరం అనుభూతుల్ని చెపుతూ మారుతున్న పరిస్థితులలో ఊరి నుండి దూరమై తమ మనసుల్ని డబ్బులో కప్పేసుకునే నేటి తరం ఆలోచనలను వీటి మధ్య నలిగిపోతున్న సున్నిత హృదయాలను రచయిత చిత్రించిన తీరు అత్యద్భుతం.

అందమైన వాక్యాలు ఆనాటి పల్లె జీవనాన్ని అందులో ఆత్మను మనకు పరిచయం చేస్తాయి. తెలుగు వచ్చిన ప్రతి ఒక్కరు ఈ పుస్తకం కొని చదివి దాచుకోవాలి, ఇక ముందు ముందు ఈ జీవితానికి సంబంధించి కథలు రావు వచ్చినా అది అనుభవించి రాసిన జీవితం కాదు, అందుకే ఇది చాలా అందమైన పుస్తకం, ప్రతి తెలుగింట చదవవలసిన కథ.

**- పి.జ్యోతి.**


# సైన్స్ కాలేజీని పరిశీలించిన వీసీ



**23.02.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో సైన్స్ అండ్ టెక్నాలజీ, ఇంజినీరింగ్ కళాశాలలను ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు గురువారం పరిశీలించారు. తరగతుల నిర్వహణ, అధ్యాపకుల పనితీరు, ల్యాబ్ వసతులు తదితర అంశాలపై ఆరా తీశారు. సైన్స్ అండ్ టెక్నాలజీ, ఇంజినీరింగ్ కళాశాలల ప్రిన్సిపాల్స్ కార్యాలయాల్లోని రికార్డులను, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది హాజరు వివరాలను పరిశీలించారు. బోధన పద్ధతులు, అధ్యాపకుల సహకారం, పాఠ్యాంశాలు, పరీక్షలకు ఏ విధంగా సిద్ధమవుతున్నారో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో ఆయా పాఠ్యాంశాల అధ్యాపకులు ఏ విధంగా బోధిస్తున్నారో ఫీడ్ బ్యాక్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలోని ఉభయగోదావరి జిల్లాలతో పాటు ఇతర ప్రాంతాల నుండి ఎక్కువ మంది అమ్మాయిలు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారని అన్నారు. మీరింతా సైన్స్ రంగంలో గొప్ప పరిశోధకులుగా, అధ్యాపకులుగా, శాస్త్రవేత్తలుగా స్థిరపడాలని విద్యార్థులకు సూచించారు. సైన్స్‌లో రాణించడానికి నిరంత సాధన ఎంతో అవసరమని చెప్పారు. విశ్వవిద్యాలయం సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల ఉన్న ల్యాబ్ వసతులను, అధ్యాపకుల విజ్ఞానాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని తెలియజేశారు. జీరో పర్సెంట్ ర్యాగింగ్ ఉన్న విశ్వవిద్యాలయంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉందని ఇటువంటి మంచి వాతావరణంలో నాణ్యమైన ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని జూనియర్ విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.రమణేశ్వరి, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా.వి.పెర్సిస్, అధ్యాపకులు పాల్గొన్నారు.


సైన్స్ కళాశాలను పరిశీలిస్తున్న వీసీ జగన్నాథరావు

## మంచి మాట






## ప్రతిభా వాణి

## మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి

**(1920 - 1992)**



**మార్చి 5న మధునాపంతుల జయంతి**

కాకినాడ తాలూకా ద్రాక్షారామ ప్రాంతంలోని పల్లిపాలెం లో 1920 మార్చి 5న మధునాపంతుల సత్య నారాయణ శాస్త్రి గారు జన్మించారు. పిఠాపుర సంస్థాన కవి ఓలేటి వెంకట రామశాస్త్రి దగ్గర సోదరులు సూరయ్య శాస్త్రి గారితో కలసి సాహిత్య అధ్యయనం చేశారు. 1938లో పల్లిపాలెంలోనే ఆంధ్రకుటీరం అనే సాహిత్య విద్యా సంస్థను స్థాపించారు. 1939 నుండి ఆంధ్రి పత్రిక వారి ఆధ్వర్యంలో తెలుగు వెలుగుగా నిలబడింది. ఆంధ్ర సాహిత్య రంగానికి ప్రామాణిక సేవలు చేసిన పత్రికలలో ఆంధ్రి స్థానం భద్రమైంది. పిఠాపురం రాజావారి సూర్యరాయాంధ్ర నిఘంటు నిర్మాణ యజ్ఞంలో భాగస్వామిగా ఉద్యోగం చేశారు. అప్పటికే తోరణం, ఖండకావ్యాలు, శ్రీఖండం, చైత్రరథం, కేళాకుళి, బోధి వృక్షం రచించారు. ఆంధ్ర రచయితలు, ఆంధ్ర పురాణం రచనల ద్వారా సాహిత్య ప్రపంచంలో మేరు పర్వత శోభను సంతరించుకున్నారు. ఆంధ్రదేశ చరిత్రను కావ్యంగా మలచిన ఆంధ్ర పురాణం మధునాపంతుల వారి యశో కేతనం. ఆధునిక పంచమహా కావ్యాలలో ఆంధ్ర పురాణం ఒకటి. తెలుగువారిని సమైక్య పరచే సాంస్కృతిక కావ్యమిది. వారి సాహిత్య వ్యాసాలు, జీవనరేఖలు సాహితీ లేఖలు గ్రంథాలలో సాహిత్య విషయాలు, చారిత్రకమైన సంగతులు కనిపిస్తాయి. వారి ఉపన్యాసాలు సామాన్యులను సాహితీ వేత్తలను ఆశ్చర్యపరిచేవి.

1947లో రాజమహేంద్రిలో వీరేశలింగం పాఠశాలలో తెలుగు పండితునిగా చేరారు. ఆంధ్ర విశ్వ విద్యాలయం వారి కళాప్రపూర్ణ గౌరవాన్ని పొందారు. రాష్ట్ర సాహిత్య అకాడమీ పురస్కారం పొందారు. రాజమహేంద్రిలో తొలుత ఇన్నీసుపేటలో నివసించిన శాస్త్రి గారు లలితా నగర్ లో స్వగృహాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ప్రతి ఏటా నన్నయ జయంత్యుత్సవాలను నిర్వహించడానికి శరన్మండలిని స్థాపించారు. 1992లో భౌతికకాయాన్ని వీడారు. వారు నివసించిన వీధికి పురపాలక సంఘం వారు మధునాపంతుల వీధిగా నామకరణం చేశారు. ఆయన నివసించటం, కావ్య ప్రపంచాన్ని సృజించటం రాజమహేంద్ర వరానికి ఒక వరం. వారికిదే నన్నయ వాణి అక్షర నీరాజనం!!

# విద్యతో పాటు విద్యార్థి నాయకుడిగా..



**స్ఫూర్తి**

మాది విశాఖపట్నం జిల్లా నక్కపల్లి మండలం గొడిచెర్ల గ్రామం. ఒక సాధారణ కుటుంబం మాది. గ్రామంలో క విద్యపై సరైన అవగాహన సరైన ఆసక్తి ఉండేవికావు. భవిష్యత్‌పై ప్రణాళికల లేకుండానే నేను ఇంటర్మీడియట్ వరకు చదువుకున్నాను. కుటుంబ జీవనోపాధి నిమిత్తం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి 2013లో వచ్చాం. ఇక్కడ ప్రముఖ కళాశాల శ్రీ కందుకూరి వీరేశలింగం ఆస్తిక కళాశాలలో B.sc (B.Z.C) జాయిన్ అయ్యాను. నేను డిగ్రీ చదువుతుండగానే నాలో ప్రతిభను గుర్తించి మా జువాలజీ మేడం డాక్టర్ పి.కృష్ణ భారతి మేడం నన్ను ఉన్నత విద్యకు పంపించాలనుకున్నారు. ఆవిడ సంకల్పంతో నేను 2016 డిగ్రీ పూర్తి చేసుకుని లైఫ్ సైన్స్ విభాగంలో ఉన్నత ర్యాంకు సాధించి నన్నయ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ జంతుశాస్త్రం జాయిన్ అవ్వడం జరిగింది. చిన్నప్పటి నుంచి డిగ్రీ వరకు తెలుగు మాధ్యమంలో చదవడం వల్ల ఎమ్మెస్సీలో పాఠాలు అర్థం చేసుకోవడం కష్టంగా ఉండేది. M.sc జంతు శాస్త్రంలో ప్రవేశించటంతో విశ్వవిద్యాలయం నన్ను మరింత జంతు ప్రేమికున్ని చేసింది. మా అధ్యాపకులు డా.రమణేశ్వరి గారు, డా.విజయ నిర్మలగారు, డా.మట్టారెడ్డిగారు, డా.కళ్యాణి గారు అంతా ఎంతో చక్కగా పాఠాలు అర్థమయ్యే విధంగా చెప్పడం వల్ల నేను తెలుగు మాధ్యమం నుండి వచ్చిన విద్యార్థిననే విషయాన్ని మర్చిపోయాను. ప్రత్యేకంగా డా.రమణేశ్వరి మేడం మరియు ఆక్వాకల్చర్ అధ్యాపకులు డా. గోవిందరావుగారు డా. శ్రీధర్ గారు విద్యార్థులు కార్యాచరణలో భాగంగా ఫీల్డ్ ట్రిప్స్ ఆక్వా రంగం అయినటువంటి Hatcheries, 'Processing and feed mills state and centeral aqua institutes' మరియు ప్రత్యేకంగా CIFE అండ్ SIFT రకరకాల ఇన్స్టిట్యూట్‌కి తీసుకెళ్లడం ద్వారా విద్యార్థులకు మంచి జ్ఞానాన్ని పెంచగలిగారు. విశ్వ విద్యాలయంలో ఉంటూనే ఆక్వారంగంలో అన్ని రకాల టెక్నిక్స్ మరియు 'advanced techniques' నేర్పించి క్షేత్రస్థాయిలో పర్యటనలు చేసి ఆక్వారంగంపై అకాడమిక్ ప్రాజెక్టును కూడా చేయడంతో ప్రముఖ MNC కంపెనీలో ఉద్యోగం రావడానికి ఎంతో ఉపయోగపడింది. ప్రస్తుతం నేను సి.పి.ఎఫ్ ఆక్వా కల్చర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ లో పనిచేస్తున్నాను. దీనిలో పనిచేయడం ఎంతోగానో ఆనందదాయకంగా ఉంది. నేను డిగ్రీ నుండి ప్రతి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని విద్యార్థి నాయకుడిగా ఎస్.కే.వి.టి కళాశాలలో పనిచేసి మరియు డిగ్రీ కాలేజీలో సైన్స్ సెక్రటరీగా మరియు 2013 సమైక్యాంధ్ర ఉద్యమంలో నన్నయ యూనివర్సిటీ సిటీ కమిటీ ద్వారా సేవలందించాను. డిగ్రీ నుండి చాలా సోషల్ యాక్టివిటీస్ చేయడం జరిగింది. ఎన్.ఎస్.ఎస్ క్యాంపులో పాల్గొనడం, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ లో లైఫ్ మెంబర్ గా ఉండటం ప్రతిదానిలోనూ చురుగ్గా పాల్గొనడం జరిగింది. విశ్వవిద్యాలయంలో ఉన్నప్పుడు ఎన్.ఎస్.ఎస్ లో, ఏబీవీపీ విద్యార్థి నాయకుడిగా పని చేసి ఎన్నో విద్యార్థి సమస్యలపై పోరాడి విజయం సాధించడం జరిగింది. ఈ ఏడాది లైఫ్ సైన్స్ విభాగానికి పూర్వ విద్యార్థుల సంఘం తరపున నన్ను ఆ కమిటీలో ప్రెసిడెంట్ గా ఎన్నుకున్నారు. దీనికి కృషి చేసినటువంటి అందరు విద్యార్థులకు మరియు ఫ్యాకల్టీ మెంబర్స్ అందరికీ నా కృతజ్ఞతలు. నేను విద్యావంతుడుని అయ్యాను అంటే నాకు జీవితాన్ని ప్రసాదించిన తల్లిదండ్రులకు, తర్వాత కళాశాల,విశ్వవిద్యాలయానికి రుణపడి ఉన్నాను. మన విశ్వవిద్యాలయం రానున్న రోజుల్లో ఎంతో విద్యావంతులను తయారుచేసి సమాజానికి అందివ్వాలని, విశ్వవిద్యాలయం సమున్నత వైభవాన్ని పొందాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

**- రాపర్తి శ్రీనివాసరావు**

-M.Sc Zoology **(2016-18) లైఫ్ సైన్స్ విభాగ అలుమ్ని ప్రెసిడెంట్.**

# కాకినాడ క్యాంపస్‌లో స్కిల్ కాలేజీ ఏర్పాటు



ఎగ్జిక్యుటివ్ డైరెక్టర్ డి.వెంకట్రామ్ కోటిరెడ్డిని సన్మానిస్తున్న వీసీ

**22.02.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎం.ఎస్.ఎన్ క్యాంపస్ కాకినాడలో స్కిల్ కాలేజీని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. రాజమహేంద్రవరం క్యాంపస్‌లో సోమవారం ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావును ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పోరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి.వెంకట్రామ్ కోటిరెడ్డి మార్యాధపూర్వకంగా కలిశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రతి పార్లమెంటరీ నియోజకవర్గానికి ఒక స్కిల్ కాలేజీని ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ ప్రణాళికలో భాగంగా కాకినాడ క్యాంపస్‌లో స్కిల్ కాలేజీ ఏర్పాటుపై చర్చించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నైపుణ్యాభివృద్ధి కోసం ప్రభుత్వం చేపట్టిన స్కిల్ కాలేజీల ఏర్పాటు హర్షనీయమని తూర్పుగోదావరి జిల్లా కేంద్రమైన కాకినాడ క్యాంపస్‌లో స్కిల్ కాలేజీ ఏర్పాటుకు కావాల్సిన చక్కని వాతావరణం, సదుపాయలు ఉంటాయని అన్నారు. స్కిల్ కాలేజీకి సంబంధించి త్వరలో విశ్వవిద్యాలయం ఒక అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంటుందని తెలియజేశారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి.వెంకట్రామ్ కోటిరెడ్డిని వీసీ సన్మానించి జ్ఞాపికను అందజేసారు. డి.వెంకట్రామ్ కోటిరెడ్డి మాట్లాడుతూ నైపుణ్యాభివృద్ధి కోసం ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమానికి చక్కని సహకారాన్ని అందిస్తున్న విశ్వవిద్యాలయ వీసీకి అభినందనలు తెలియజేసారు. రాష్ట్ర వ్యాప్తంగా 30 స్కిల్ కాలేజీలను ఏర్పాటు చేస్తున్నామని ఒక్కోక్క స్కిల్ కాలేజ్ రూ.40 కోట్లు అంచాన నిర్మిస్తున్నామని అన్నారు. త్వరలో యుతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందుబాటులో ఉంటుందని తెలిపారు. అనంతరం కాకినాడ ఎం.ఎస్.ఎన్ క్యాంపస్‌లో స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, యూనివర్సిటీ స్కిల్ డెవలప్మెంట్ కోఆర్డినేటర్ డా.బి.జగన్మోహన రెడ్డి, కాకినాడ క్యాంపస్ ప్రత్యేకాధికారి డా.ఎం.కమలకుమారి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు

# సాంకేతికతతో భూగర్భజలాలపై అధ్యయనం

### "వినిమయ" లెక్చర్ క్లబ్ లో ఆచార్య వై.శ్రీనివాసరావు



ఉపన్యసిస్తున్న ఆచార్య వై.శ్రీనివాసరావు

**23.02.21 (మీడియాసెల్)** సాంకేతిక పరిజ్ఞానంతో భూగర్భ జలాలపై అధ్యయనాలు జరుగుతున్నాయని ఈ పరిశోధన ఫలాలు సమాజానికి ఎంతో ఉపయోగపడతాయని ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయం జియాలజీ ఆచార్యులు వై.శ్రీనివాసరావు అన్నారు. ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన "వినిమయ" లెక్చర్ క్లబ్ లో ఆచార్య వై.శ్రీనివాసరావు రెండవ ఉపన్యాసం చేశారు. విశ్వవిద్యాలయం కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ లెక్చర్ లో వీసీ ఆచార్య జగన్నాథరావు, ప్రిన్సిపాల్స్, డీన్స్, అధ్యాపకులు హాజరైయ్యారు. ఈ సమావేశంలో ఆచార్య వై.శ్రీనివాసరావు భూగర్భజలాలకు సంబంధించిన కీలక అంశాలపై ఉపన్యసించారు. భూభాగ పగుళ్ల జాడలను పరిశీలించి ఏయే ప్రాంతాలలో ఏ స్థాయిలో భూగర్భ జలాలు ఉన్నాయనే అంశాలను, తెలుసుకొనే విధానాలను వివరించారు. గృహ అసరాలకు, వ్యవసాయ అవసరాలకు భూజలాలు ఏయే ప్రాంతాలలో ఏయే స్థాయిలలో ఉన్నాయనే వివరాలను జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ద్వారా తెలుసుకొనే విధానాలను తెలియజేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించు కొని భూగర్భ జలాలపై అనేక పరిశోధనలు చేయవచ్చునని అవి సమాజానికి ఎంతో ఉపయోగ పడతాయని వివరించారు. వీసీ మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ ఇటువంటి లెక్చర్‌క్లబ్‌ల ద్వారా ఆయా విభాగాల్లో నిష్ణాతులైన ఆచార్యుల విజ్ఞానం అందరికీ అందుతుందని తెలియజేశారు. దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయంలో అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# సమర్థవంతమైన సన్నాహాలతో జియోలజీలో అవకాశాలు

### వీసీ మొక్కా జగన్నాథరావు

**26.02.21 (మీడియాసెల్)** సమర్థవంతమైన సన్నాహాలతో జియో సైంటిస్ట్ మరియు జియోలజిస్ట్ పరీక్షలలో విజయం సాధించి ఉన్నత ఉద్యోగాలలో స్థిరపడవచ్చునని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. జియోలా జికల్ సర్వే ఆఫ్ ఇండియ ట్రైనింగ్ ఇన్సిట్యూట్ ఆధ్వర్యంలో 25,26 తేదిలలో వర్చువల్ ఇంటరాక్టివ్ సెషన్‌ను నిర్వహించారు. "జియోసైంటిస్ట్ అండ్ జియోలజిస్ట్ యుపిఎస్సి పరీక్షల కోసం సమర్థవంతమైన సన్నాహాలు" అంశంపై జరిగిన ఈ వర్చువల్ సదస్సులో దేశ వ్యాప్తంగా వెయ్యి మంది విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులు హాజరయ్యారు. జియోలజీలో సీనియర్ ప్రొఫెసర్‌గా నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆచార్య మొక్కా జగన్నాథరావు ముఖ్యవక్తగా ఉపన్యసించారు. జియోలజీలో ఉన్నత శిఖరాలలో స్థిరపడడానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని వాటిని అందిపుచ్చుకొనేందుకు సాధన ఎంతో అవసరమని అన్నారు. పరీక్షలకు, ఇంటర్వ్యూలకు సిద్ధపడుతున్న విద్యార్థులు సబ్జెక్టుపై పట్టు సాధించాలని చెప్పారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే విద్యార్థులు నిజాయితీగా, స్పష్టంగా సమాధానాలు చెప్పాలన్నారు. విద్యార్థికి ఏ పాఠ్యాంశాలపై పట్టు అధికంగా ఉంటుందో దానిని గురించి ఎక్కువ ప్రస్తావన చేయాలని తెలిపారు. జియోసైంటిస్ట్ అండ్ జియాలజిస్ట్ పరీక్షలు, ఇంటర్వ్యూలకు అవసరమైన మెలుకువలను, సూచనలను అందించారు. తరువాత జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియ ట్రైనింగ్ ఇన్సిట్యూట్ రిటైర్డ్ డైరెక్టర్ జనరల్ ఎన్.కుటుంబరావు, ప్రిన్సిపాల్ సైంటిస్ట్ గవర్నమెంట్ ఆఫ్ మేఘాలయ జి.హెచ్.పి.రాజు ఐ.పి.ఎస్ లు ఉపన్యసించారు.

# ఫ్రెషర్స్ డే అదుర్స్






అపురూపమైన, అందమైనచెట్ల మధ్య, స్వచ్ఛమైన చల్లనిగాలి,చదువుల వెలుగుల మధ్యన మన విశ్వవిద్యాలయం నెలకొని ఉంది. ఆ మహావృక్షం నీడలో కొన్నాళ్ళు చదువుకోవడానికి ఇక్కడ అడుగుపెడతాం. కొత్త మిత్రులు, అందమైన జ్ఞాపకాలు, అనేకమైన పరిచయాలు, కొత్త కొత్త పాఠాలు,పుస్తకాలు,మాస్టార్లు, ఎన్నో కార్యక్రమాలు.... నిన్నటి కన్నా ఈరోజు అనేక విషయాలు నేర్చుకుంటూ, చదువులతో ఎదిగి పోతూ సంస్కారాన్ని ఒదిగి పట్టుకుంటూ ఉద్యోగాలకై, జీవన సారాంశాన్ని వెతుక్కుంటో వెళ్లిపోతాం... ఇదిగో కొత్తగా ప్రవేశించిన అందరికీ మన సీనియర్స్ ఈ విశ్వవిద్యాలయంలోకి స్వాగతం పలుకుతున్నారు.... కొత్త మిత్రులు, కొత్త చదువులతో గొప్ప వ్యక్తులుగా ఈ సమాజానికి ఉపయోగపడాలని, మీరంతా విశ్వవిద్యాలయానికి విద్యా సంపదగా నిలవాలన్నదే నన్నయవాణి ఆకాంక్ష!!



























## ర్యాగింగ్ రహిత విశ్వవిద్యాలయం

నేను గ్రామీణ ప్రాంతం నుండి వచ్చిన విద్యార్థులు విశ్వవిద్యాలయం అంటే ఎంతో బాధపడ్డాను ర్యాగింగ్ ఎక్కువగా ఉంటుందని భయపడుతూ వచ్చాను. కానీ విశ్వవిద్యాలయంలో ఎక్కడ ర్యాగింగ్ అనే మాట కూడా లేకుండా సీనియర్ విద్యార్థులు సొంత బ్రదర్స్ లాగా జూనియర్లను చూస్తున్నారు. పాఠ్యాంశాలు, ల్యాబ్ లు విషయంలో మాకు ఎన్నో సలహాలు సూచనలు ఇస్తూ మా విద్యాభివృద్ధికి వారు ఎంతో సహకరిస్తున్నారు.

**గౌరీ శివాజీ, ఆక్వా కల్చర్**

## ఉన్నత విద్యకు నిలవెత్తు రూపం నన్నయ


ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉన్నత విద్యకు నిలువెత్తు రూపంగా కనపడుతుంది. చక్కని భవనాలు, అనుభవజ్ఞులైన ఆచార్యులు, ఆధునిక ప్రమాణాలతో కూడిన నాణ్యమైన ల్యాబ్ లు ఇక్కడ ఉన్నాయి. అధ్యాపకులు అర్థమయ్యేరీతిలో పాఠ్యాంశాలను చక్కగా బోధిస్తున్నారు. తొలిసారిగా ఫ్రెషర్స్ పార్టీ ని ఇంత ఘనంగా నిర్వహించడం చూశాను మాకు గొప్పగా స్వాగతం పలికిన సీనియర్ విద్యార్థులకు హృదయపూర్వక ధన్యవాదాలు.

**జి, భవ్య వినీత దేవి బయోకెమిస్ట్రీ**

## నిరంతర పర్యవేక్షణ

విశ్వవిద్యాలయంలో తరగతుల తో పాటు వసతి గృహాలు, క్రీడా ప్రాంగణాలు ఎంతో ఆకర్షించాయి. వసతిగృహాల పై తరగతుల పై విశ్వవిద్యాలయ వీసీ, రిజిస్ట్రార్ మరియు అధికారుల పర్యవేక్షణ నిరంతరం ఉంటుంది. తద్వారా మాకు ఎటువంటి సమస్య రాకుండా ఎటువంటి ఇబ్బందులు రాకుండా చక్కని వాతావరణంలో విద్యను అభ్యసిస్తున్నాం. అధ్యాపకులు పాఠ్యాంశాలు అర్థమయ్యే విధంగా బోధిస్తూ ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. మా సీనియర్లు మాకు చక్కని మార్గదర్శకత్వాన్ని చూపిస్తున్నారు.

**ఎ.లోవరాజు, బయోటెక్నాలజి**



C. V. Raman was the first `non-white', Asian and Indian to receive the Nobel prize in physics for his work on scattering of light and discovery of the Raman effect. He also used to work on problems in the field of acoustics at the Indian Association for the Cultivation of Science.

# ఘనంగా సైన్స్ డే



మన కొలతల కందని కాలం నుంచి కొరతలేని పరిపూర్ణ విజ్ఞానాన్ని ఆవిష్కరించుకున్నదే భారతదేశం.మేధకి సంబంధించిన ఏ గొప్ప ఆవిష్కరణ అయినా మన ప్రాచీన విజ్ఞానలొనే ప్రత్యక్షమవుతుంది. అంతరిక్ష, ఆరోగ్య, వ్యవసాయ, వైజ్ఞానిక,సాంకేతిక సాంస్కృతిక, ఆధ్యాత్మికత... మొదలైన ప్రతిభా మణి దీపికలను ప్రదర్శించి అటుపై నవీనతలో కూడా భారతీయ ఘనతను చాటి చెప్పింది మన విజ్ఞాన శాస్త్రం.ఎదుగుతున్న నవీన నాగరకతకు ప్రాచీన భారత విద్యా కల్పవృక్షం ఆసరా కావాలి.

సర్ సి.వి. రామన్ ఎఫెక్ట్ ఆవిష్కరింపబడిన రోజిది. (ఫిబ్రవరి 28) అందరికీ (సైన్స్ డే) విజ్ఞానశాస్త్ర దినోత్సవ శుభాకాంక్షలు!!



















ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in